# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 22 జనవరి, 2026 | పేజీలు :08


## రెండో రోజు అట్టహాసంగా కొనసాగిన నిర్మల్ ఉత్సవాలు..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రెండవ రోజు నిర్మల్ ఉత్సవాల కార్యక్రమం అట్టహాసంగా కొనసాగింది. ఉదయం నుంచి భారీ సంఖ్యలో నిర్మల్ పట్టనంతో పాటు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన సందర్శకులు పాల్గొన్నారు. స్టాల్స్ సందర్శించి, ఉత్సవాల వినోదాన్ని అనుభూతి చెందారు. చిన్నారులు కేరింతలు కొడుతూ ఉత్సాహంతో ఆటలు ఆడుకున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు, సందర్శకులతో ఎన్టీఆర్ మినీ స్టేడియం కిక్కిరిసిపోయింది. మంగళవారం రాత్రి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.సెల్ఫీ పాయింట్ వద్ద చిన్నారులతో ఫోటోలు దిగారు.మిగిలిన మూడు రోజుల పాటు మరింత ఉత్సాహభరింతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న పలువురికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు,జ్ఞాపికలు అందజేశారు.నిర్మల్ ఉత్సవాలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,ఆర్డీవో రత్న కళ్యాణి,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలు

మన గ్రామాలను అభివృద్ధి చేసుకుంటే మన తల్లికి సేవ చేసినట్లే

గ్రామపంచాయతీ సర్పంచుల ఓరియంటేషన్ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం /మల్యాల :** జగిత్యాల జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు నూకపల్లి న్యాక్ సెంటర్ లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ,ఆర్డబ్ల్యూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ధనసరి అనసూయ (సీతక్క), జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్,జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో మూడు విడతలుగా 385 మంది సర్పంచ్ లకు శిక్షణ అందిస్తున్నామని ఈ నెల 19 నుండి 23 వరకు నూతనంగా ఎన్నికైన సర్పంచులకు మొదటి విడుత 122 సర్పంచ్ లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇక్కడికి ఆహ్వానించినందుకు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ కు అభినందనలు తెలిపారు. గ్రామ పంచాయితీ ఎన్నికలలో ఆశలు, ఆశయాలు, లక్ష్యాలు పెట్టుకొని, ఎదురైన ఇబ్బందులను తట్టుకొని ప్రజల చేత ఎన్నికైన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు,గుర్తించిన సమస్యలను వేగవంతంగా పరిష్కరించే విధంగా పట్టుదలతో ముందుకు వెళ్లాలని సూచించారు. మనం శాశ్వతం కాదు, మన పదవులు శాశ్వతం కాదు, కానీ మనం చేసే పనులు ఎప్పటికీ శాశ్వతం అని ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తు ఉంటాయని తెలిపారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే ఆర్థిక సంఘం నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు చేరుతాయని అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులు, పన్నులు ముఖ్యంగా గ్రామాలను అభివృద్ధి పరచాలంటే పాలనాపరంగా ఏం కావాలో ఈ శిక్షణ కార్యక్రమంలో తెలుసుకోవచ్చని అన్నారు. మన గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటే మన తల్లికి సేవ చేసినట్లే, మన గ్రామానికి మంచి పని చేస్తే గ్రామ ప్రజలు మనల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఇటీవల గ్రామ పంచాయితీలకు 277 కోట్లు మంజూరు చేసిందని గత రెండు సంవత్సరాలుగా నిలిచిపోయిన కేంద్ర ప్రభుత్వ నిధులు 2000 కోట్లు త్వరితగతిన వచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. వచ్చిన నిధులను గ్రామంలో ప్రాధాన్యత ప్రకారం గ్రామసభలో తీసుకున్న తీర్మానాల ప్రకారం ప్రజా ఉపయోగ పనులను గుర్తించి వాటికోసం వినియోగించాలని తెలిపారు. గ్రామాల్లో సర్పంచులుగా ఎన్నికైన మీరు పంచాయితీ కార్యదర్శులను అలాగే ఇతర అధికారులను మరియు ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని సుపరిపాలన అందించాలని మీ గ్రామాలను ఆయా గ్రామాలని ఆదర్శవంతమైన గ్రామాలుగా మరియు ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేరళ రాష్ట్ర గ్రామాలను ఆదర్శంగా తీసుకుని మీరు కష్ట పడి పనిచేసి మీ గ్రామాలను అభివృద్ధి లో ముందంజలో ఉంచి ఉత్తమ గ్రామాలుగా అవార్డులు సాధించే విధంగా కృషి చేసి దేశంలోనే మన తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచాలని అలాగే జగిత్యాల జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంచే విధంగా మీరంత కష్ట పడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జెడ్పీ సి.ఈ.ఓ గౌతం రెడ్డి, డిఆర్డిఒ రఘువరన్, డిప్యూటీ సిఈవో పి. నరేష్, జిల్లా పంచాయతీ అధికారి మదన్మోహన్, డిడబ్ల్యూఒ బి. నరేష్, పంచాయతీ రాజ్ ఈఈ లక్ష్మణ్ రావు, శిక్షణ జిల్లా పంచాయతీ అధికారి,రేవంత్, ఎంపిడివోలు, ఎంపివోలు, టివోటిలు, సంబంధిత అధికారులు, డిపివో కార్యాలయ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలను
# పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ డి.వేణు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.జిల్లాలో జనరల్, వోకేషనల్ కలిపి మొత్తం 7 వేల 965 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 22 పరీక్ష కేంద్రాలలో ఇంటర్ థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని,పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్ లలో స్పెషల్ బస్సులు నడపాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కల్పన, పెద్దపల్లి ఆర్డిఓ గంగయ్య, ఏసీపీ జి. కృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్ ,రమేష్ సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



# గల్లీలో పనిచేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే



**ప్రజాపక్షం/కరీంనగర్:** గల్లి గల్లి లో పనిచేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఢిల్లీలో ఉన్న బిజెపి గల్లీలో పనిచేయదని వారికి ఓటు వేసినా వృధాయేనని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యమవుతుందని గల్లి గల్లిలో ఏ అభివృద్ధి పని చేయాలన్న కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని తెలిపారు. కరీంనగర్ లోని 13 డివిజన్ సప్తగిరి కాలనీ లో మార్కండేయ నగర్లో మార్కండేయ జయంతి సందర్భంగా ఆలయంలో రాజేందర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు ప్రతినిధులు మహిళలు ప్రజలు పెద్ద సంఖ్యలో రాజేందర్ రావు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పటు చేసిన కార్యక్రమంలో వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ గల్లి గల్లి లో సమస్యల పరిష్కారం కాంగ్రెస్తోనే సాధ్యమవుతుందని తెలిపారు. పారిశుద్ధము రోడ్లు మౌలిక వసతుల కల్పనా తాగునీటి సరఫరా, పోలీసు, రెవెన్యూ శాఖకు సంబంధించిన పనులు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అవుతాయని పేర్కొన్నారు. ఢిల్లీలో ఉన్న బిజెపికి కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటు వేస్తే వృధానేనని మండిపడ్డారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఆశీర్వదించి అండగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతున్నదని తెలిపారు. జిస్కు జిత్నా ఉసుకు ఉత్న ఎవరేంతో వారికి అంత కుల ప్రాతిపదికన మున్సిపల్ ఎన్నికల్లో సీట్లు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. 13వ డివిజన్లో పద్మశాలి కులస్తులు ఎక్కువగా ఉన్నందున ఆ సామాజిక వర్గానికే టికెట్ కేటాయిస్తే బాగుంటుందనే భావనతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కుల సంఘం ప్రతినిధులు కాంగ్రెస్ నేతలు పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు

**ప్రజాపక్షం/కరీంనగర్:** అక్టోబరు నెలలో పాఠశాల స్థాయిలో జరిగిన సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ జనరల్ నాలెడ్జ్ ఒలింపియాడ్ లో సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు పాల్గొని బుధవారం వెలువడిన ఈ ఫలితాలలో సెయింట్ జార్జ్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి, ప్రతిష్టాత్మకమైన గోల్డ్ మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ సాధించినట్లు చైర్మన్ డాక్టర్ ఫాతిమా రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు తమ మేధస్సుతో పసిడి పథకాలు సాధించి పాఠశాల గౌరవాన్ని చాటారన్నారు. విజేతల వివరాలు వెల్లడించారు. 4వ తరగతి: ఆర్యన్, 5వ తరగతి: దేవాంశ్, 6వ తరగతి: స్వీకృత్, 7వ తరగతి: ఆదిత్య స్వామి,సిరి, ఇమ్మాన్యుయేల్ 8వ తరగతి: సుశాంత్, యశశ్విన్ రెడ్డి, అనీష్ రావు, 9వ తరగతి: విశాల్ పటేల్,



హర్షిత్ రెడ్డి, వైష్విక్ రావ్, 10వ తరగతి: అక్షిత్, సాత్విక్, శ్రీచరణ్ తేజలు విజేతలుగా నిలిచారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా॥ పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల నిరంతర కృషి మరియు ఉపాధ్యాయుల సరైన మార్గదర్శకత్వం వల్లే ఈ ఘనత సాధ్యమైందని కొనియాడారు. విజేతలైన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు గ్రామపంచాయతీలు ముస్తాబ్

**ప్రజాపక్షం/ముత్తారం :** జనవరి 26న జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నూతనంగా గెలిచిన సర్పంచ్ ల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయాలతో పాటు గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దే పనిలో పడ్డారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని సీతంపల్లి గ్రామ సర్పంచ్ గా నూతనంగా గెలిచిన సర్పంచ్ ఇండ్ల కృష్ణవేణి సదానందం ఆధ్వర్యంలో ఈ నెల 26న తొలిసారిగా నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. గ్రామపంచాయతీ ఆవరణ నుండి పలు వీధుల్లో ఉన్న చెట్లకు త్రివర్ణ పతాకం జెండా రంగులు వేస్తూ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.అలాగే మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా గెలిచిన సర్పంచ్ లు ఆధ్వర్యంలో జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.

## సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా శ్రీనివాస్

**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా బసంత్ నగర్ గ్రామ సర్పంచి పర్శవేని శ్రీనివాస్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ బుధవారం నియమించారు. మండలంలోని 16 గ్రామాల సర్పంచులు ఏకాభిప్రాయంతో శ్రీనివాస్‌ను ఎన్నుకోగా ఫోరం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే అవకాశం కల్పించారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్‌ల సహకారంతో మండలంలోని అన్ని గ్రామాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అందరూ సర్పంచులకు అందుబాటులో ఉంటూ వారి సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడ్తానని సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పర్శవేని శ్రీనివాస్ తెలిపారు.

## ఘనంగా మార్కండేయ జయంతి

**ప్రజాపక్షం/ధర్మపురి :** మార్కండేయ జయంతిని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి.స్థానిక మార్కండేయ ఆలయంలో అర్చకులు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉదయం మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం వేదపండితులు బొజ్జ సంపత్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పద్మశాలి కుల మహిళలు భారీసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సేవాసంఘం అధ్యక్షులు కొంక సుధీర్ కుమార్,ప్రధాన కార్యదర్శి భోగ మల్లేష్,ఉపాధ్యక్షులు వెలగందుల అనిల్,బైరి మల్లేష్,సుమన్,కుల పెద్దలు,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ లోని గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జరుగుతాయని,జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు,సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని అదనపు కలెక్టర్ తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి జాతీయ పతాక ఆవిష్కరణ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. గణతంత్ర వేడుకల డయాస్ , సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు. ఏఎన్ఎం ఆధ్వర్యంలో వైద్య బృందాలచే శిభిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్య అతిథి గా జిల్లా కలెక్టర్ అందించే సందేశం రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా అందజేయాలని అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి గంగయ్య, ఏసీపీ జి. కృష్ణ,కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్ ,రమేష్ సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఏ నీరు ఎటు పోతే మాకేంటి మా జీతం మాకు వస్తే చాలు

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** మిషన్ భగీరథ నీటితో తగడానికి నీళ్లు లేని ప్రాంతాల వారికి తాగడానికి నీరు అందించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం అధికారుల నిర్లక్ష్యానికి ఆవిరైపోతుంది. జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలో గత వారం రోజులు నుండి జగిత్యాల ధర్మపురి మిషన్ భగీరథ మెయిన్ పైపు లైన్ లీకేజీతో నీరు వృధాగా పోతుందని చుట్టు గ్రామల ప్రజలు మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం కండ్లకు కట్టినట్టు కనిపిస్తుందంటున్నారు. సంబంధిత అధికారులకు అనంతారం గ్రామస్థులు పిర్యాదు చేసిన పట్టించుకోకుండా ఏ నీరు ఎటు పోతే మాకేంటి మా జీతం మాకు వస్తే చాలు అనట్టుగా ఉంటున్నారని అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మిషన్ భగీరథ అధికారులు పనితనానికి పథకం ఒక్కటే తక్కువా....!** జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలో జగిత్యాల ధర్మపురి మిషన్ భగీరథ మెయిన్ పైపు లైన్ లీకేజీ కావడంతో వారం రోజులుగా నీరు వృథాగా వెళ్తున్న మిషన్ భగీరథ అధికారుల కంట పడకపోవడం అర్థం కాని పరిస్థితి. గత పదిహేను రోజుల క్రితం ప్రస్తుతం నీరు లీకేజీ ఐన పక్కన లీకేజీ కావడంతో మిషన్ భగీరథ అధికారులు సిబ్బంది లీకేజీకి మరమ్మత్తులు చేసిన పదిహేను రోజులు పూర్తికాకముందే లీకేజీ ఐన పక్కనే నీరు మరో



సారి లీకేజీ కావడం మిషన్ భగీరథ అధికారుల, చుట్టు గ్రామల ప్రజలు పిర్యాదులుపనితనానికి పథకం ఒక్కటే తక్కువా....! అని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. నీరు ఎక్కువగా వృథాగా పోతుందని అనంతారం గ్రామస్తులు చేసిన అధికారులు ఇప్పటికీ స్పందించకపోవడంతో అధికారుల బాధ్యతారహితంగా ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తుదంటున్నారు.

**– లీకేజీ మరమ్మత్తు మెటీరియల్ ఆర్డర్ పెట్టాం రెండు రోజులలో సమస్య పరిష్కరిస్తాం :** రాజశేఖర్, జగిత్యాల మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్ జగిత్యాల రూరల్ మండలంలోని అనంతారం గ్రామ రోడ్డం వాగు వద్ద జగిత్యాల ధర్మపురి మిషన్ భగీరథ మెయిన్ పైపు లైన్ లీకేజీతో నీరు వృథాగా వెళ్తున్నాయని జగిత్యాల మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్ ను ప్రజాపక్షం జగిత్యాల రిపోర్టర్ చారవాణి ద్వారా సంప్రదించగా ఆ పైపు లైన్ లీకేజీకి సంభదించిన మెటీరియల్ ప్రస్తుతం లేదని ఆర్డర్ పెట్టామని మెటీరియల్ రెండు మూడు రోజులలో వస్తుందని రాగానే లీకేజీ సమస్యను పరిష్కరిస్తామని ఏఈ రాజశేఖర్ గత వారం రోజుల క్రితం తెలిపారు.

## రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేత

**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామంలో రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలైన రోటావేటర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, పవర్ టిల్లర్లు, వరి గడ్డి కోత యత్రాలు, కలుపు తీసే యంత్రాలను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ బుధవారం రాత్రి పంపిణి చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన యూరియా సరఫరా ఉప కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రామగుండం నియోజకవర్గ పరిధిలోని రైతులకు ఇప్పటి వరకు రూ.23 లక్షల విలువ గల యంత్ర పరికరాలను అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎల్కలపల్లి, గుంటూరుపల్లి, లక్ష్మీపూర్ ప్రాంతాల రైతులు యూరియాకై దూరంగా ఉన్న కన్నాల, కమాన్‌పూర్‌లకు వెళ్లే వారని ఇప్పుడూ స్థానికంగా వారికి అందుబాటులో ఉండేలా



ఉప కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ గాలిపెల్లి తిరుపతి, ఎల్కలపల్లి సర్పంచి ఎరుకల అంజయ్య, గుంటూరుపల్లి సర్పంచి ఎర్రం హరినాథ్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా వ్యవసాయాధికారి బత్తిని శ్రీనివాస్, సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనాథ్, పాలకుర్తి, రామగుండం, అంతర్గాం మండలాల వ్యవసాయాధికారులు బండి ప్రమోద్‌కుమార్, కొప్పుల ప్రకాష్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ ఇ-టెక్నో లో ఘనంగా ఖేల్ కి జోష్

**ప్రజాపక్షం/కరీంనగర్:** క్రీడల ద్వారా విద్యార్థులకు ఒత్తిడి నుండి ఉపశమనం లభించడమే కాకుండా మానసికంగా శారీరకంగా అభివృద్ధి చెందుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో నిర్వహించినటువంటి అల్ఫోర్స్ ఖేల్ కి మస్త్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థులకు ఎన్నో లాభాలు చేకూర్చడమే కాకుండా వారికి చదువు పట్ల ఆసక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. మన భారత దేశంలో క్రీడా రంగానికి ఎనలేని ప్రాముఖ్యత ఉన్నదని ఎంతోమంది క్రీడారంగంలో రాణించి స్ఫూర్తినిస్తున్నారని సూచించారు. విద్యార్థులకు నూతనోత్సాహం పెంపొందించడానికి, స్నేహపూర్వకమైన వాతావరణం కల్పించడానికి పాఠశాలలో వివిధ రకాల క్రీడలను నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయుల తో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదర్శ స్కూల్' క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల తహసీల్ కార్యాలయంలో మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్లను తహసీల్దారు తూము రవీందర్ పటేల్ ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల చదువు పట్ల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు కనబరుస్తున్న శ్రద్ధను తహసీల్దారు అభినందించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు అంగోతు శ్రీనివాస్ నాయక్, నాయబ్ తహసీల్దారు మల్యాల తిరుపతి, టిటిఎస్ అంతర్గాం గ్రామ సర్పంచి అంబోతు రవికుమార్ నాయక్, గిర్దావర్లు సడెంక శ్రీమాన్, గుంట రమేష్, జూనియర్ అసిస్టెంటు శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## ప్రపంచ సదస్సుకు కార్మిక నేత 'బాబర్'

**ప్రజాపక్షం/అంతర్గాం :** గ్లోబల్ లేబర్ మార్కెట్ కన్వెన్షన్‌కు సంబంధించి ఈనెల 26, 27వ తేదీల్లో సౌదీ ఆరేబియా రియాజ్ నగరంలో అక్కడి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు స్థానిక ఐఎన్‌టియుసి జాతీయ నాయకులు బాబర్ సలీంపాషా హాజరు కానున్నారు. ప్రపంచంలో మారుతున్న కార్మిక చట్టాలు, యాజమాన్యం, ట్రేడ్ యూనియన్ల పాత్రపై ఈ సదస్సు జరగనున్నది. బుధవారం ఎన్‌టిపిసి పట్టణంలో బాబర్ సలీంపాషాను కలిసి అభినందనలు తెలిపినట్లు అఖిల భారత అంబేడ్కర్ సంఘం అంతర్గాం మండల అధ్యక్షులు ఇండిబెల్లి రవీందర్‌కుమార్, అంతర్గాం మజీద్ కమిటి ప్రతినిధి తాజొద్దీన్‌లు తెలిపారు. ఈ సదస్సుకు ప్రపంచంలోని 126 దేశాల నుంచి 7 వేల మంది ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు, 200 మంది స్పీకర్లు హాజరవుతుండగా, భారతదేశం నుంచి ఐఎన్‌టియుసి ప్రతినిధిగా బాబర్‌సలీంపాషాకు ఆహ్వానం లభించినట్లు తెలిపారు.

## మురికి కాలువలో చెత్తాచెదారం తొలగింపు

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామంలోని పలు వీధుల్లో డ్రైనేజీ కాలువలతో పాటు సీసీ రోడ్డు పక్కన ఉన్న మురికి కాలువలో పేర్కొని పోయిన చెత్తాచెదారం జెసిబి తో తొలగింపు జరిగింది.ఈ పనులను సర్పంచ్ అత్తె చంద్రమౌళి పరిశీలించారు. గ్రామంలోని పలు వీధుల్లోని రోడ్డు పక్కన కాలువలో పిచ్చి మొక్కలు పెరిగాయని మట్టి కూరుకొని పోవడంతో సర్పంచ్ చంద్రమౌళి జేసీబి ద్వారా ఈ చెత్తాచెదారం తొలగించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి దిలీప్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** తెలంగాణ మోడల్ స్కూల్ గర్రెపల్లిలో ఆరవ తరగతి పదవ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డా.గోల్డి బాల్బీర్ కౌర్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 19 న 6వ తరగతి వారికి ఉదయం 10:00 నుంచి 12 గంటల వరకు 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అదే రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు.ఆరవ తరగతి ప్రవేశానికి ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతూ ఉండాలని 7 నుంచి 10 తరగతి వరకు ఖాళీగా ఉన్న వాటిని భర్తీ చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేకతల గురించి ప్రిన్సిపల్ తెలుపుతూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డుల సహాయంతో విద్యాబోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం &అధ్యాపక బృందం, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ మాథ్స్ ల్యాబ్,గ్రంథాలయం, విశాలమైన క్రీడా స్థలం,ఉచిత నోట్ బుక్స్ అండ్ టెక్స్ట్ బుక్స్ అండ్ యూనిఫామ్, పూర్తి ఆంగ్ల మధ్యమంలో ఉత్తమ భోదన ఉత్తమ ఫలితాలు,ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమలలో విద్యార్థులను తీర్చి



దిద్దుట.వృత్తివిద్య కోర్సు లు బ్యూటీ అండ్ వెల్నెస్ మరియు ఐ టి & ఐ.టీ.ఇ.ఎస్ తో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం కలదు అని తెలిపారు.అడ్మిషన్ల కొరకై ఓపెన్ కేటగిరి విద్యార్థులకు 200 రూపాయలు. బిసి,ఎస్సి, ఎస్టి,పిహెచ్సి,. మరియు ఇడబ్ల్యు విద్యార్థులకు 125 రూపాయలను చెల్లించి telanganams.cgg.gov. in అనే వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగలరని ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ముత్తారంలో ఆర్టిఏ అధికారుల తనిఖీలు

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో పెద్దపల్లి ఆర్టీఏ అధికారులు తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముత్తారం మీదుగా గోదావరిఖని, మంథని వైపు వెళ్తున్న పలు వాహనాలను ఆపి వాహన సంబంధిత ధ్రువీకరణ పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహన సంబంధిత పలు పేపర్లను పరిశీలించి వదిలేశారు. వాహన దృవీకరణ పత్రాలు లేని వాహనాలకు ఫైన్ విధించినట్లు తెలిసింది.

## 'రక్షా యూత్' క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/రామగుండం:**రామగుండం పట్టణం హౌసింగ్‌బోర్డుకాలనీలో రక్షా యూత్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ నాయకుడు పల్లికొండ రాజేష్ మాట్లాడుతూ, 29వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా మున్సిపల్ ఎన్నికల్లో నిలబడుతున్న పల్లికొండ పూజ రాజేష్‌కు ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను కోరారు. గత కొంతకాలంగా సామాజిక కార్యక్రమాలు చేపడుతూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ ప్రజలు ఒక్క అవకాశం ఇవ్వాలని ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన యువకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణంకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని 11వ వార్డు విద్యానగర్ లో బుధవారం సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పీర్ మొహమ్మద్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీర్ మహమ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సహకారంతో వార్డులో రూ.10 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. వేములవాడ పట్టణ, ఆలయ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో సాధ్యమైతుందన్నారు. రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో 11వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని, వార్డు అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని, వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ సర్కార్‌ను బర్తరఫ్ చేసేలా కార్యాచరణ చేపట్టాలే

**ప్రజాపక్షం/రామగిరి :** బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసేలా కార్యాచరణ చేపట్టాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు సింగరేణి టెండర్లలో సైట్ విజిట్ నిబంధన పేరుతో కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణానికి పాల్పడి సింగరేణిని కొల్లగొడుతున్న కాంగ్రెస్ నేతల అవినీతిని ఎండగడుతూ ఆర్జీ 3 జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో టీబీజీకేస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆర్జీ 3 జీఎంకు వినతిపత్రం అందించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈనాడు ప్రభుత్వం టెండర్లు రద్దు చేసిందంటే అందులో మోసం ఉందని నిర్ధారణ అయిందని, ఇక విచారణ అవసరంలేదన్నారు. టెండర్ల విషయంలో జరిగిన మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు మాజీమంత్రి హరీష్‌రావుకు నోటీసులు ఇచ్చి విచారణ పేరుతో మభ్యపెట్టే ప్రయత్నాలను, కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్‌ను యావత్ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అంటేనే తెలంగాణ



రాష్ట్ర ప్రజల పార్టీ అని ప్రజల కోసమే పార్టీ ఉంటుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. హరీష్‌రావుకు నోటీసులు ఇస్తే జంకిపోతారని అనుకుంటున్నారేమో కానీ బీఆర్ఎ స్శ్రేణులు ఉవ్వెత్తున ఎగిసిపడి ఈ సింగరేణి సంస్థను కాపాడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో కమాన్పూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ,దేవ. శ్రీనివాస్,కాపురబోయిన భాస్కర్, పొన్నం సది తదితర బిఆర్ఎస్ నాయకులు టీజి బీకెఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సొమ్మొకరిది సోకొకరిది అన్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సొమ్మొకరిది సోకొకరిది అన్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి అన్నారు. బుధవారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కేవలం బిజెపి కి మాత్రమే ఉందని, ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ నిధుల తోనే మున్సిపాలిటీల మనుగడ సాగుతుందని అన్నారు. సిరిసిల్ల పట్టణానికి కేంద్ర ప్రభుత్వం అర్బన్ డెవలప్మెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కింద 15 కోట్లు మున్సిపాలిటీలకు ఇచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా మూడు కోట్లు కలిపి మొత్తం మేమే మంజూరు చేసినట్లు వాటిని ఇనాగ్రేషన్ చేయడానికి సిద్ధపడటం సిగ్గుచేటు అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కేవలం బిజెపికి మాత్రమే ఉందన్నారు. మున్సిపాలిటీలకు పట్టణ ప్రగతి కింద 30 లక్షలు నిధులు వస్తే వాటిని సిబ్బంది జీతాలకు వాడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ స్కీం కింద సిరిసిల్ల మున్సిపాలిటీకి 104 కోట్లు



మంజూరు చేసిందన్నారు. అట్టి నిధులను రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు వేసి రేవంత్ రెడ్డి బామ్మర్ది షోద కంపెనీకి టెండర్ వచ్చేలా చేసినట్లు ఆరోపించారు. 14 ,15 ఫైనాన్స్ ద్వారా సిరిసిల్ల మున్సిపాలిటీకి వచ్చిన రెండు కోట్ల రూపాయలు దేనికి వెచ్చించారో సమాధానం చెప్పాలన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించి సిరిసిల్ల మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చేసుకుందామని గోపి కోరారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు ధూమాల శ్రీకాంత్, శీలం రాజు,గజ బింకర్ చందు, మోర అజయ్, శంకర్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే వాహనం నడపొద్దు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి18 సంవత్సరములు నిండి ఉన్నవారే బైక్ నడపాలని సహాయక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రజనీదేవి సూచించారు. బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి పాఠశాల, ఇంగ్లీష్ యూనియన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి హాజరై రజని విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రమాదాలలో ఎక్కువగా యువకులు మరణించడం జరుగుతుందనీ కుటుంబానికి ఆశా కిరణంగా ఉన్న యువకుడు తల్లిదండ్రులకు ఇష్టమైన ప్రతిరూపమైన కుమారులు కుమార్తె పిల్లల భవిష్యత్తుకు ఆధారమైన తండ్రి అనేక ప్రమాదాలలో చనిపోవడం బాధాకరం అన్నారు. మోటర్ వెహికల్ పై ముగ్గురు రైడింగ్ చేయొద్దని సూచించారు. ఆల్కహాల్ సేవించి వాహనాలు నడపొద్దు అని సూచించారు. తప్పనిసరిగా వాహనం నడిపే ముందు హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపే అప్పుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పల్లె రాజిరెడ్డి, రాజ్ కుమార్ లు మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్ తప్పకుండా పాటించాలని రెడ్ సిగ్నల్ పడ్డప్పుడు ఆగాలన్నారు. రోడ్డు భద్రత మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది కానిస్టేబుల్ రమ్య, సౌమ్య ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కెజివీల్స్‌తో రోడ్డుపై నడుపుతున్న ట్రాక్టర్ పట్టివేత,



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ళ గ్రామంలో కేజీవీల్స్ తో రోడ్డుపై నడుస్తున్న ట్రాక్టర్‌ను ఎస్సై చంద్రకుమార్ పట్టుకున్నారు .అట్టి ట్రాక్టర్ నీరుకుళ్ళ అనుబంధ గ్రామమైన రంగంపల్లికి గ్రామానికి చెందిన సాగర్ రావు దిగా గుర్తించారు. రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్‌లు నడపడం వల్ల రోడ్లు డ్యామేజ్ అవుతున్నాయని,దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని కావున ఎవరూ కూడా కేజీవీల్స్ తో రోడ్ల పైకి రాకూడదని ఒకవేళ వచ్చినట్లయితే జరిమానాతో పాటు కఠిన చర్యలు తప్పవని ఎస్సై చంద్రకుమార్ హెచ్చరించారు.ఇట్టి ట్రాక్టర్ ను తదుపరి చర్యల కోసం తహసిల్దార్ అప్పగించడంతో తహసిల్దార్ భషీరుద్దీన్ 5 వేల రూపాయలు జరిమాన విధించారు.

## పద్మశాలి సంఘానికి భోజనప్లేట్లు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని పద్మశాలిసేవాసంఘానికి రాజన్నజిల్లా రెడ్డి సంఘం అద్యక్షులు గుండార పు కృష్ణారెడ్డి భోజనప్లేట్లు వితరణచేశారు.బుధవారం భక్తమార్కాండేయ సేవసంఘానికి 200వందల భోజనం చేయడానికి అనుకూలంగా ఫైబర్ ప్లేట్లు వితరణచేశారు. ప్రత్యేకపూజలు చేశారు,అనంతరం ఆత్మీయంగా సన్మానం చేశారు.కార్యక్రమంలొ వనం రమేష్ సంఘం సభ్యులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన...



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని కంచర్ల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఎంపీఓ బీరయ్య బుధవారం పరిశీలించారు. అనంతరం వారు లబ్దిదారులతో మాట్లాడుతూ నిర్ణీత గడువులోగ ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకొని, ప్రభుత్వం అందించే రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారి వెంట గ్రామ సర్పంచ్ సామల్ల దేవరాజ్, గ్రామ కార్యదర్శి వెన్నెలతో పాటు సిబ్బంది ఉన్నారు.

## ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/చందుర్తి :** చందుర్తి మండల టీయుడబ్ల్యూజేహెచ్ 143 ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా లింగాల తిరుమల్ , ఉపాధ్యక్షులుగా రాజూరి విష్ణు,ప్రధాన కార్యదర్శిగా మ్యాకల కొమురయ్య,కోశాధికారిగా మేడిశెట్టి మధు,కార్యదర్శులుగా కొడగంటి గంగాధర్ , వంకాయల కార్తీక్ ,గౌరవ అధ్యక్షులుగా లింగాల లింగయ్య,ఏనుగుల కృష్ణ , గౌరవ సలహాదారుగా గొట్టె మనోహర్ , కార్యవర్గ సభ్యులుగా రాజూరి సద్గుణాచారి,రాజూరి రఘురాం,బొట్లవార్ శ్రీనివాస్ ,నక్క యాకూబ్,మర్రి నిశాంత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ సంఘం జర్నలిస్టుల హక్కులు , సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు.చందుర్తి మండల నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి పలువురు ప్రజాప్రతినిధులు , నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆలీ,విజయ్,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిఎం కప్ ఎంపిక పోటీలు

**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో సిఎం కప్ ఆటల పోటీల కోసం గురువారం ఉదయం 10 గంటలకు నూకపెల్లి ప్రతిభ హై స్కూల్ ఆవరణలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని పిడి విశ్వ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కోకో క్రీడల కోసం 20 సంవత్సరాల వయస్సు దాటినవారు అర్హులని, అలాగే అండర్ 21 విభాగంలో కబడ్డీ పోటీల్లో పాల్గొనే బాల బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత సర్టిఫికెట్ ని వ్యాయామ ఉపాద్యాయులైన రమేష్ , నవీన్‌కు అందజేయాలని పిడి తెలిపారు.

## పట్టపగలే చోరీ

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని గుండంపల్లి గ్రామంలో పట్టపగలే చోరీ జరిగినట్లు సమాచారం. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు చోరీలో మూడు తులాల బంగారం సుమారు లక్ష రూపాయల నగదు అపహరణ జరిగినట్లు తెలుస్తోంది. కాగా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. దొంగతనానికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసులు తెపాల్సి ఉంది.

## జాతర ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో జరగనున్న శ్రీసమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్లను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ బుధవారం పరిశీలించారు. అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణాలతోపాటు జాతర వద్ద చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అన్ని సౌకర్యాలు సమకూర్చాలని జాతర కమిటీ నిర్వాహకులకు చెప్పారు. ఎమ్మెల్యే వెంట రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గాలిపెల్లి తిరుపతి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు ఉన్నారు.

## మల్లన్న స్వామి రథోత్సవం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలో నడికుడిగ్రామంలో మల్లన్నస్వామి జాతర ఉత్సవాల భాగంగా బుధవారం స్వామి వారి రథోత్సవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి రథోత్సవాన్ని చేపట్టగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సమత, గ్రామాభివృద్ధి సభ్యు లు, ప్రజా ప్రతినిధులు,గ్రామస్తులు ఉన్నా రు.

# గణతంత్ర వేడుకలకు గ్రామపంచాయతీలు ముస్తాబ్



**ప్రజాపక్షం/ముత్తారం :** జనవరి 26న జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నూతనంగా గెలిచిన సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయాలతో పాటు గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దే పనిలో పడ్డారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని సీతంపల్లి గ్రామ సర్పంచ్‌గా నూతనంగా గెలిచిన సర్పంచ్ ఇండ్ల కృష్ణవేణి సదానందం ఆధ్వర్యంలో ఈ నెల 26న తొలిసారిగా నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. గ్రామపంచాయతీ ఆవరణ నుండి పలు వీధుల్లో ఉన్న చెట్లకు త్రివర్ణ పతాకం జెండా రంగులు వేస్తూ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.అలాగే మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా గెలిచిన సర్పంచ్ లు ఆధ్వర్యంలో జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.

# ఘనంగా భక్త మార్కండేయ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** భక్త మార్కండేయ జయంతి ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రం తో పాటు మండలంలోని శ్రీరాముల పల్లె, లోత్తునూరు, వేణుగుమట్ల, రంగధాముని పల్లె గ్రామాలలోని మార్కండేయ ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం అందజేశారు. శ్రీరాములపల్లి లో సర్పంచ్ సల్లూరి శోభన్ గౌడ్,ఉపసర్పంచ్ గడ్డం కవిత రాజేందర్ రెడ్డి,వార్డు సభ్యులు సూర్య మరియు నూతన పాలకవర్గానికి పద్మశాలి సంఘం సభ్యుల శాలువాలతో సత్కరించి మార్కండేయ స్వామి చిత్రపటాలను అందజేశారు. మండల కేంద్రంలో స్వామివారి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలలో గొల్లపల్లి పద్మశాలి సంఘం అధ్యక్షులు అంకం భూమయ్య, ప్రధాన కార్యదర్శి చౌటపెల్లి తిరుపతి (బట్టల), ఉపాధ్యక్షులు గాజేంగి హనుమండ్లు,కోశాధికారి అంకం లక్ష్మీ నారాయణ,సహాయ కార్యదర్శి చౌటపెల్లి రఘునందం,శ్రీరాములపల్లి అధ్యక్షులు కట్కం రాజలింగు, ఉపాధ్యక్షులు వడ్ల కొండ మహేష్, ప్రధాన కార్యదర్శి కట్కం రమేష్ లోత్తునుర్ అధ్యక్షులు కొప్పు అంజయ్య,ఉపాధ్యక్షులు సామల పెద్ద గంగారం,కొప్పు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక బహిరంగ వేలం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మల్లాపూర్ మండలం గోదావరి తీర ప్రాంతంలోని ఓ గ్రామంలో ఇసుక అక్రమ రవాణాకు మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు సమాచారం. కాగా గ్రామానికి చెందిన వ్యక్తి వేలంలో పాల్గొని మూడు లక్షల 50 వేల రూపాయలకు వేలాన్ని దక్కించుకున్నాడు. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి బహిరంగ వేలం పాటలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయి. అధికారులు దృష్టి సారించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అక్రమ దందాలను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ప్రమాదాల నివారణకు ముళ్ల పొదలు తొలగింపు

**ప్రజాపక్షం/ముత్తారం :** ఓడేడు నుండి ఖమ్మంపల్లి, తాడిచర్ల, కాల్వపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారిలో మూల మలుపుల వద్ద తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్, ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామపంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి మాట్లాడుతూ, రహదారికి అడ్డుగా ఉన్న చెట్లు, పొదలను గ్రామపంచాయతీ సిబ్బంది సహాయంతో తొలగించినట్లు తెలిపారు.ప్రమాదాలకు కారణమవుతున్న అడ్డంకులను తొలగించడం ద్వారా ప్రయాణికుల భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లువారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, కారోబార్ అక్కపాక ప్రభాకర్, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విహారయాత్రలు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రత్యక్ష అనుభవం ద్వారా విజ్ఞానం పెంపొందించాలనే ఉద్దేశంతో విజ్ఞాన విహారయాత్ర కార్యక్రమాన్ని గొల్లపల్లి ప్రాథమిక పాఠశాల, నీరుకుళ్ల ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు పాఠశాలల నుంచి మూడు, నాలుగు తరగతులకు చెందిన సుమారు 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ విజ్ఞాన విహారయాత్రకు గొల్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, సహోపాధ్యాయులు సమత,అలాగే నీరుకుళ్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి నాయకత్వం వహించారు. విద్యార్థులను సుల్తానాబాద్ పట్టణానికి తీసుకువెళ్లి అక్కడి వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాసేవా కేంద్రాలను సందర్శింపజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు పోస్ట్ ఆఫీస్‌ను సందర్శించి తపాలా వ్యవస్థ పనితీరు, లేఖలు, పార్సిళ్లు, మనీ ఆర్డర్, పోస్టల్ సేవింగ్స్ వంటి సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించి భూమి రికార్డులు, ఆదాయ ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విధానం గురించి అవగాహన పొందారు. తదుపరి ఎంపిడివో కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులకు గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, పంచాయతీ వ్యవస్థ, ఉపాధి హామీ పథకం వంటి అంశాలపై అధికారులు వివరించారు. అలాగే జిల్లా కోర్టును సందర్శించి న్యాయ వ్యవస్థ ప్రాముఖ్యత, కోర్టుల విధులు, చట్టాల అమలు విధానం గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రతి వృత్తి సమాజ అభివృద్ధిలో పోషించే పాత్రను విద్యార్థులకు వివరించారు.ఈ విజ్ఞాన విహారయాత్ర విద్యార్థుల్లో ప్రభుత్వ వ్యవస్థలపై అవగాహనను పెంపొందించడంతో పాటు, సామాజిక బాధ్యత, శ్రమ విలువ, సంప్రదాయ వృత్తుల ప్రాముఖ్యతను తెలుసుకునేలా చేసిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని వారు పేర్కొన్నారు.

# విద్యుత్తు దీపాల ఏర్పాటుకై వినతి

**ప్రజాపక్షం/రామగుండం :** ముస్లిం సోదరుల పండుగ 'షబ్ ఎ బరాత్'ను పురస్కరించుకొని రామగుండం పట్టణంలోని కబ్రస్తాన్‌లో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని, చెట్లు, పొదలను తొలగించాలని కోరుతూ రామగుండం నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీకి బుధవారం వినతిపత్రం అందజేసినట్లు 27వ డివిజన్ మాజీ కార్పొరేటర్ షమీమ్ సుల్తానా అహ్మద్‌బాబు తెలిపారు. వచ్చేనెల 3వ తేదీన పండుగ సందర్భంగా రాత్రి సమయంలో ముస్లింలు ప్రార్థనలు చేసుకుంటారని వసతులు కల్పించాలని కోరినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో నిజాం, మహ్మద్ తౌఫిక్‌లు ఉన్నారు

## మహిళలపట్ల అసభ్య ప్రవర్తన.. ఐదుగురి యువకులపై కేస్ నమోదు



**ప్రజాపక్షం /మల్యాల :** మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించి, దూషించడంతోపాటు చంపుతామని బెదిరించినటువంటి సంఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐనరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సారంగాపూర్ మండలానికి చెందిన దండుగుల లక్ష్మి అనే మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనం అనంతరం గుట్ట క్రింద కూర్చుని భోజనం చేసే సమయంలో వారికి దగ్గరలో కొంతమంది యువకులు కూర్చుని మద్యం సేవించి, ఆ మత్తులో బాధితురాలితో పాటు తన తోటి కోడళతో గొడవకు దిగి, నానా దుర్భాషలాడుతూ, విడియోలు తీసి చంపుతామని బెదిరించారనే లక్ష్మి ఫిర్యాదు మేరకు భగత్‌తో పాటు మరో నలుగురు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఘనంగా మార్కండేయ జయంతి

**ప్రజాపక్షం/ధర్మపురి :** మార్కండేయ జయంతిని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి.స్థానిక మార్కండేయ ఆలయంలో అర్చకులు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉదయం మహా రుద్రాభిషేకం నిర్వహించారు.అనంతరం వేదపండితులు బొజ్జ సంపత్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పద్మశాలి కుల మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సేవాసంఘం అధ్యక్షులు సుధీర్ కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లేష్, ఉపాధ్యక్షులు అనిల్, బైరి మల్లేష్,సుమన్,కుల పెద్దలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్థిక–డిజిటల్ సాక్షరతపై అవగాహన



**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం, పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామంలో బుధవారంనాబార్డ్ సహకారంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ముత్తారం శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక,డిజిటల్ సాక్షరత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, పొదుపు అలవాట్లు, ప్రభుత్వ పథకాలు, డిజిటల్ లావాదేవీల వినియోగం, డిజిటల్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు.నగదు లావాదేవీలకు బదులుగా డిజిటల్ లావాదేవీలను సురక్షితంగా ఎలా ఉపయోగించుకోవాలో బ్యాంకు అధికారులు వివరించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ముత్తారం శాఖ మేనేజర్, సిబ్బంది హాజరయ్యారు. అలాగే విభూతి కళాజాత బృందం ప్రదర్శించిన వీధి నాటకాలు, జానపద గీతాలు గ్రామస్థులలో ఆర్థిక అవగాహనను పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషించాయి.గ్రామ ప్రజలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్యాంకింగ్ సేవలు, రుణాలు, బీమా, డిజిటల్ బ్యాంకింగ్‌పై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.గ్రామీణ ప్రజలకు ఆర్థిక జ్ఞానం అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని బ్యాంకు అధికారులు పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

# నిర్మల్ పోలీస్ టైగర్స్ ట్రోఫీ విజేత ఏఆర్ హెడ్ క్వార్టర్స్

## జిల్లా ఎస్పి జానకీ షర్మిల

**ప్రజాపక్షం/నిర్మల్ :** పోలీస్ సిబ్బందిలో పని ఒత్తిడిని తగ్గించి,శారీరక,మానసిక ఉల్లాసాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన "నిర్మల్ పోలీస్ టైగర్స్ ట్రోఫీ" క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది.జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు సాగిన ఈ పోటీలను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ప్రారంభించి,ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ టోర్నమెంట్‌లో నిర్మల్ సబ్ డివిజన్,బైంసా సబ్ డిబిజన్,ఏఆర్ హెడ్ క్వార్టర్స్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి.ఫైనల్ మ్యాచ్‌లో బైంసా సబ్ డివిజన్,ఏఆర్‌హెడ్ క్వార్టర్స్ జట్ల మధ్య ఉత్కంఠభరితమైన పోరు సాగింది.చివరికి ఏఆర్‌హెడ్ క్వార్టర్స్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.విజేతలకు ట్రోఫీని అందజేసిన ఎస్పీ మాట్లాడుతూ నిత్యం విధులతో బిజీగా ఉండే పోలీస్ సిబ్బందికి ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో ఉత్సాహాన్నిస్తాయని,వారిలో టీమ్ స్పిరిట్‌ను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.సిబ్బంది తమ కుటుంబ సభ్యుల సమక్షంలో ఆడుతూ పాడుతూ గడపడం సంతోషకరమని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో బైంసా ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్,నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్,ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్,కృష్ణ,ఆర్.ఐలు రామ్ నిరంజన్ రావు,రామకృష్ణలతో





పాటు ఎస్ఐలు,ఆర్.ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది,వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెల్‌ఫోన్‌లో కాకుండా గ్రౌండ్‌లో ఆడాలి

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** నేటి యువతరం,బాలలు సెల్ ఫోను లో ఆటలు అడుతు దానికి బానిసలై మానసిక,శారీరక ఆరోగ్యాన్ని కోల్పోతున్నారని అలా కాకుండా గ్రౌండ్ లో ఆటలు ఆడాలని దిలావర్‌పూర్ మంబల పరిషత్ అభివృద్ధి అధికారి అరుణ రాణి అన్నారు.సి.ఎం క్రీడా ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం దిలావర్‌పూర్ క్లస్టర్ లోని క్రీడా కారు.నిర్వహించిన పోటీల ప్రారంబానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడల పట్ల గొప్ప ధార్మనికత కలిగి క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తున్నారని దిలావర్‌పూర్ సర్పంచ్ పాల్దే అక్షర్ అనిల్ అన్నారు.మండలఅ అభివృద్ధి అధికారి అరుణ రాణి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో నిర్వహిఒచిన సి.ఎం కప్ ర్యాలీని క్రీడజ్యోతి వెలిగించి,జెండా ఊపి పారంభించిన అనంతరం అమె క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు.కప్పు ను లక్ష్యంగా పెట్టుకొని ప్రతిరోజు చక్కని సాధన చెయ్యాలని సూచించారు.క్రీడలు దేహ ధారుధ్యాన్ని కాపాడుతూ మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు.క్రీడల్లో గెలుపు ఓటములు సహజ మని ఓటమినే గెలుపుకు తొలిమెట్టు అని అన్నారు.మండల విద్యాధికారి సదానందం మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తు భవిష్యతకు మంచి పునాది వేసుకోవాలని సూచించారు.క్రీడలు జీవితం లో ఒక ముఖ్య భాగంగా ఉండాలని దిలావర్‌పూర్ ఉప సర్పంచ్ సుఖేష్ అన్నారు.మదేగాం సర్పంచ్ మారుతి,వార్డు మెంబర్లు తదితరలు మాట్లాడుతూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పి.సదానం దం, వ్యాయమ ఉపాధ్యాయులు జి.అం బాజి, శారద, జయ,గ్రామ కార్యదర్శి మహేందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం మండల విద్యాధికారి సదానందం ఆధ్వర్యంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి చేతుల మీదుగా క్రీడ దుస్తులను పంపిణీ చేశారు.పి.ఎం.శ్రీ.స్కీమ్ కింద మంజూరయ్యాయని సదానందం తెలిపారు.



### విద్యార్థులక్షేత్ర పర్యటన

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉనత పాఠశాల విద్యార్థులు బుధవారం ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం జీవశాస్త్ర ఉపాధ్యాయులు సల్లా పోశెట్టి,శ్రీప్రియ ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన లో భాగంగా పొలంలో వరి నాట్లు వేశారు.వ్యవసాయ పనులను ప్రాముఖ్యతను వ్యవసాయ ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్ స్వప్న విద్యార్థులకు వివరించారు.ఈ క్షేత్ర పర్యటనలో సీనియర్ ఉపాధ్యాయలు నాగభూషణం,ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్ లు గజేందర్,స్వప్న,తదితరలుఉ పాల్గొన్నారు.అంబాజీ చాలా కృషి చేశారని చెప్పారు.

# 12 దేశవ్యాప్త సమ్మె బిజెపి ప్రభుత్వానికి కనువిప్పు కావాలి

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా మున్సిపాలిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, రైతులు,వ్యవసాయ కూలీలు భాగస్వాములు కావాలని ఆ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మేమో .జీఓ ప్రకారం వేతనాలు అమలు చస్తున్నవని నిండు అసెంబ్లీ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడడం జరిగింది.కాని బైంసా మున్సిపాలిటీలో జీవో 60 ప్రకారం ,కార్మికులకు వేతనాలు అమలు చేయడంలో జిల్లా కలెక్టర్ కమిషనర్ జీవో లను పక్కకు పెట్టి తక్కువ వేతనంతో శ్రమ దోపిడి చేస్తున్న జిల్లా కలెక్టర్ ఇప్పటివరకు నవంబర్,డిసెంబర్ నెల,12 మంది కార్మికుల వేతనము వాళ్ళు బ్యాంక్ డబ్బులు జమ కాలేదు. వెంటనే డబ్బులు చేయాలి,పెండిగ్‌లోఉన్న సంవత్సరం కాలం పిఎఫ్ డబ్బులు వెంటనే జమ చేయాలి,ఆశ,అంగన్వాడీ,మధ్యాహ్న భోజన, పట్టణ ఆర్పీలు,కార్మికులకు కనీస వేతనం 26,000 పెంచాలి,ఉద్యోగ భద్రత కల్పించాలి,ఎన్డీ హయంలోని బిజెపి ప్రభు త్వం కార్మిక చట్టాలు మార్చవద్దని కేంద్ర కార్మిక సంఘాలు ఎంత హితవు పలికిన పేడచెవన పెట్టా రన్నారు.బీహార్ ఎన్నికల మ రింత వేగం పెంచిందని వ్యక్తం చేశారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని భోసి,గ్రామంలో 19 లక్షల నిధులతో పాఠశాల పహారీ గోడ నిర్మాణానికి,10 లక్షల నిధులతో మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పవార్‌రామారావ్ పటేల్ బుధవారం భూమి పూజ నిర్వహించారు.గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం గ్రామంలో ఉన్న పలు సమస్యల పరిశించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్దే తమ ప్రధాన లక్ష్యమని,విద్య,మహిళా సంక్షేమం పేదల గృహావసరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.భోసీ గ్రామంలో చేపడుతున్న ఈ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ,మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్,హౌసింగ్ డిఈ, హౌసింగ్



ఏఈ,ఐకెపి ఏపిఓ,పంచాయతి రాజ్ ఏఈ శివలింగయ్య, మండల బిజెపి అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి,బోసి గ్రామ సర్పంచ్ సాగర నాగనాథ్,బొంద్రట్ సర్పంచ్ రవీంద్రపటేల్,జవుల బీ సర్పంచ్ శేషరావు పటేల్,బామిని సర్పంచ్ గణేష్,నాయకులు శివాజీ పటేల్,మాజీ సర్పంచ్ మారుతి ,మండల మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**ప్రజాపక్షం/బైంసా :** మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు నాయకులు పనిచేయాలని ఎమ్మెల్యే రామారావ్ పటేల్ సూచించారు.బుధవారం బైంసా లో బిజెపి పట్టణ కార్యకర్తలు నాయకులతో సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మున్సిపల్ ఎన్నికలు ఉన్న తరుణంలో కొన్ని పుకార్లు,అసత్య ప్రచారాలు నమ్మవద్దని సూచించారు.పార్టీ ఎవరికీ టికెట్లు ఖరారు చేయలేదని,అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు.ఒక వార్డులో 10 మంది పోటీలో ఉంటే ఒక్కరికే టికెట్ వస్తుందని,నిరాశ చెందకుండా పార్టీ కోసం పని చేయాలన్నారు.మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ పదవులు దక్కించుకునే విధంగా అందరూ కష్టపడాలన్నారు.అదిష్టానం బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపుతుందని అందరి అభిప్రాయాల మేరకు టికెట్లు ఖారారు అవుతాయన్నారు.

### పార్టీ టికెట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

బిజెపి ఎన్నికల ఇంచార్జ్ అడ్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆశావాహుల నుండి దరకాస్తుల స్వీకరించారు ఆయా వార్డులో పోటీ చేయడానికి ఇప్పటివరకు 70 దరఖాస్తులు వచ్చాయి.మరో రెండు రోజులపాటు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో అభ్యర్థిత్వాల కోసం దరఖాస్తుల స్వీకరణ జరగనుంది.మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ చిన్నారెడ్డి,కో కన్వీనర్ లు రవిపాండే,నారాయణ్‌రెడ్డి,బి. గంగాధర్,బిజెపి పట్టణ అధ్యక్షుడు రావుల రాము తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ కవికి 'అక్షరప్రవీణ జాతీయ ప్రతిభా పురస్కారం'



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ కు చెందిన ప్రముఖ పద్య కవి,వ్యాఖ్యాత,సంస్కృతభాషా ప్రచార సమితి ఆదిలాబాద్,నిజామాబాదు ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపకు అధ్యక్షుడు డా.బి.వెంకట్‌కు విజయవాడలో అక్షరప్రవీణ జాతీయ ప్రతిభా పురస్కారమును బుధవారం శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ సంస్థ అధ్యక్షుడు డా.కత్తిమండ ప్రతాప్ కుమార్,జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీనాగభూషణంలు అందజేశారు.అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్,గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశ్రీ కళా వేదిక 162వ సాహితీ సాంస్కృతిక పట్టాభిషేకం మహోత్సవంలో నిర్మల్ నుండి డా.బి.వెంకట్ కవి పాల్గొని,ఈ పురస్కారమును అందుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశములోని ఆంధ్రప్రదేశ్,తెలంగాణ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక,గోవా,మహారాష్ట్ర,తమిళనాడు రాష్ట్రాలనుండి 360 మందికి పైగా కవులు కవయిత్రులు పాల్గొన్నారని వెంకట్ చెప్పారు.జిల్లాలోని పలువురు కవులు ఈయనను అభినందించడం జరిగింది.

# రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/నేరడిగొండ :** మండలంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాల బుగ్గారంలో 2026 జాతీయ రహదారుల సేఫ్టీ అవశ్యకతపై జిల్లా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్,ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ చదువుతోపాటు దేశము లోని రోడ్ల విస్తరణ పై రోడ్ సేఫ్టీ,ట్రాఫిక్ సమస్యలపై ప్రతి కుటుంబంలో అవగాహన ఉండాలని రోడ్ సేఫ్టీ ని ప్రతి ఒక్కరు పాటించి మన కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించినట్లయితే రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి,ఎంఈఓ భూమారెడ్డి,ఏఎంబిఐ శ్వేత,హెల్త్ సూపర్వైజర్ సంతోష్,ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయిలో ప్రతిభను చాటిన వేదం విద్యార్థులు

**ప్రజాపక్షం/బోథ్ :** స్థానిక వేదం పాఠశాలలోని విద్యార్థులకు ఆదివారం సుచిర్ ఇండియా ఫౌండేషన్ 33వ సర్ సి.వి.రామన్ ఒలంపియాడ్ పోటీ పరీక్షను నిర్వహించారు.ఈ పోటీ పరీక్షలో ఆద్యశ్రీ,(మూడవ తరగతి)స్మైనా (4వ తరగతి)జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులు ఫిబ్రవరి 3న రవీంద్ర భారతి ఆడిటోరియం హైదరాబాదు నందు అవార్డులు అందుకోబోతున్నారు. ర్యాంకు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# కన్నుల పండుగగా వీరాంజనేయ జంగల్ హనుమాన్ సాయిబాబా వార్షికోత్సవం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలం కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ శివ సాయి సమాజ్ జంగల్ హనుమాన్ లో గల సాయిబాబా ఆలయ 29వ వార్షికోత్సవం జాతర కన్నుల పండుగగా జరిగింది.పరమ పవిత్ర ఉత్తర వాహిని గౌతమి గోదావరి తీరాన గల ఆలయ వార్షికోత్సవంలో ఉదయం నుండిన సాయిబాబా మందిరంర్ల మూలవిరాట్ విగ్రహానికి పంచామృత అభిషేకముతో పాటు హారతి ఇచ్చి అష్టోత్తర శతనామావళి పూజ వేద పండితుల చేత నిర్వహించడం జరిగింది.ఆలయ ఆవరణలో శివపార్వతుల కళ్యాణం,భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా వేదపండితుల మంత్రోచ్ఛారణ లతో నిర్వహించారు.అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.వార్షికోత్సవం సందర్భంగా కళాకారులచే సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.జాతరలో ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖచే బారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ,బిఆర్ఎస్ నియోజకవర్గం ఇంచార్జ్ జాన్సన్ నాయక్,బిజెపి నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ వంటి ప్రముఖులు ప్రత్యేక పూజలు చేసి ఆలయ అర్చకులచే తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# మహిళల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి పరచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బొజ్జు పటేల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం డ్వాక్రా మహిళలను ఆర్థికంగా ఎదిగేలా చేయడం కోసం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల అభివృద్ధి కోసం అనేక రకాల కార్యక్రమాలను చేపట్టిటందన్నారు.మహిళలకు పావలా వడ్డీకి రుణాలు అందజేయడం మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయడం, పెట్రోల్ పంపులు మంజురు చేయడం,షాపింగ్ కాంప్లెక్స్ లో షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మించడం,మహిళలకు స్వయం ఉపాధి పథకాల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ఇలాంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందన్నారు.ముఖ్యంగా మహిళలకు విద్య అవకాశాలను మెరుగుపరచడం కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు.మహిళలు చదువుకుంటే వారి కుటుంబం బాగుపడుతుందని కుటుంబాలు బాగుపడతే గ్రామాలు బాగుపడతాయి అని అన్నారు.తెల్ల రేషన్ కార్డులో పేరు నమోదై ఉండి పార్టీలతో సంబంధం లేకుండా 18 సంవత్సరాలు పైబడిన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.మహిళలను అన్ని రకాలుగా ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఎన్నో రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.అదేన విధంగా పట్టణ కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ కొమరం భీమ్ కాలనీ వద్ద కోటి 43 లక్షల రూపాయలతో ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వ



లక్ష్యమని ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఆరోగ్యశ్రీ పథకానికి పది లక్షలు పెంచారని,విధంగా జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూషణ్,వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద,ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికేని దయానంద్,నాయకులు రాజురా సత్యం,కావాలి సంతోష్,షబ్బీర్ పాష,కిషోర్ నాయక్,కుర్మా శ్రీనివాస్,ఎంపిడిఓ రమాకాంత్,మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్,ఎమ్మార్వో సుజాత,సివో రవీందర్,సివో శ్రావతి,తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి ఎస్ఐగా నరేష్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం / మందమర్రి :** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ కొత్త ఎస్ఐగా గోపతి నరేష్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు నియమితులైన ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం తన కార్యాచరణను వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్ఐ జి. నరేష్ మాట్లాడుతూ ప్రజల శాంతిభద్రతల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యమని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తూనే చట్టాన్ని ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. ము ఖ్యంగా పట్టణంలో నిషేధిత గుట్కా, గంజాయి, మత్తుపదార్థాల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ కార్యకలాపాలను అరికడతామని తెలిపారు. ప్రజలు, పోలీసుల మధ్య సమన్వయం ఉంటేనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని అన్నారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ట్రాఫిక్ నియమాల అమలులో కఠినంగా వ్యవహరిస్తామని నరేష్ తెలిపారు.

## గ్రామాభివృద్ధికి 10 లక్షల విరాళం అందజేత

**ప్రజాపక్షం / దండేపల్లి :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దండేపల్లి మండలంలోని వెల్గనూర్ గ్రామాభివృద్ధి కోసం బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి 10 లక్షల రూపాయల స్వంత నిధులను అందజేశారు. బుధవారం గ్రామంలో ఈ నిధులతో చేపట్టనున్న గ్రంథాలయ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. గత ఎన్నికల సమయంలో బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మనసా తులసిని గెలిపిస్తే గ్రామాభివృద్ధికి తన వంతుగా 10 లక్షల రూపాయలు ఇస్తానని రఘునాథ్ వెరబెల్లి హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు ఆమెను గెలిపించడంతో ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, గ్రామస్థులందరికీ ఉపయోగపడేలా మొదటిగా గ్రంథాలయ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకొని అభివృద్ధికి సహకరించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మనసా తులసి, బిజెపి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

**ప్రజాపక్షం/బైంసా :** విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని బైంసా మండల ఎంపీడీవో నీరజ్ కుమార్, మండల విద్యాధికారి సుభాష్,దేగాం సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి అన్నారు.బుధవారం మండలంలోని దేగాం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు క్లస్టర్ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు.క్రీడలతో పేరు ప్రతిష్టలు సంపాదించవచ్చని,మానసిక ఉల్లాసం తో పాటు,ఐక్యత భావం పెంపొందుతుందన్నారు.సిఎం రేవంత్ రెడ్డి క్రీడా పోటీలు నిర్వహించడం మంచి పరిణామం అని విద్యార్థులు రాష్ట్రస్థాయి వరకు రాణించాలని సూచించారు.ఈ సందర్భంగా యోగాలో రాణించిన విద్యార్థులకు,యోగ మాస్టర్ మల్లేష్‌కు అభినందించి సత్కరించారు.కార్యక్రమంలో ఎంపీఓ ప్రదీప్,ప్రధానోపాధ్యాయులు గంగాధర్,ఉప సర్పంచ్ శివాజీ,ఇలేగాం సర్పంచ్ రాజమణి శ్రీనివాస్,ఉపాధ్యాయులు,వార్డు మెంబర్లు గ్రామ పెద్దలు విద్యార్థులు పాల్గొన్నారు.



## బోరిగం సర్పంచ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

### తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమయ్య డిమాండ్

**ప్రజాపక్షం/లక్ష్మణచాంద :** నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం బోరిగం గ్రామంలో ఆదిమ గిరిజన మహిళపై జరిగిన అమానుష దాడి ఘటనపై తుడుందెబ్బ (ఆదివాసి దెబ్బ) సంఘం తీవ్రస్థాయిలో విరుచురుపిడింది.అగ్రకుల అహంకారంతో అమాయక ఆదివాసులపై దాడులు చేస్తూ, వారిని మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తున్న బోరిగం గ్రామ సర్పంచ్ కోరేపల్లి మల్లికార్జున్ రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య డిమాండ్ చేశారు.బుధవారం లక్ష్మణచాంద మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,గత సర్పంచ్ ఎన్నికల సమయంలో తనకు మద్దతు ఇవ్వలేదన్న పాత కక్షలను మనసులో పెట్టుకుని,సర్పంచ్ మల్లికార్జున్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదిమ గిరిజన మహిళ పోతరాజు చిన్నమ్మ పై పక్కా పథకం ప్రకారం దాడికి తెగబడ్డారని ఆరోపించారు.స్నానాల గదిలో ఉన్న పోతరాజు చిన్నమ్మను కనికరం లేకుండా బలవంతంగా బయటకు ఈడ్చుకుంటూ వచ్చి,జుట్టు పట్టుకుని వీధిలోకి లాగి కొట్టడమే కాకుండా,సభ్య సమాజం తలదించుకునేలా ఆమెను వివస్త్రను చేసి ఘోరంగా అవమానించడంపై భూమయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.''మేము రెడ్డిలము..మాకే ఎదురు తిరుగుతావా?''అంటూ అత్యంత హీనంగా కులదూషణకు పాల్పడటం సర్పంచ్ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు.ఈ దాడి సమయంలో బాధితురాలి మెడలో ఉన్న 18 మసల బంగారు గొలుసును కూడా నిందితులే అపహరించారని,ఇది కేవలం దాడి మాత్రమే కాదని,గిరిజనులను భయభ్రాంతులకు గురిచేసే ఒక అరాచక చర్య అని వారు పేర్కొన్నారు.తక్షణమే మల్లికార్జున్ రెడ్డిని,అతనికి సహకరించిన వారిని ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అరెస్ట్ చేసి జైలుకు పంపాలని,బాధిత కుటుంబానికి పోలీస్ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.గిరిజన మహిళా ఆ త్మగౌరవం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని,నిందితులకు కఠిన శిక్ష పడే వరకు విశ్రమించబోమని గిరిజన నాయకులు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సాకి లక్ష్మణ్,మాజీ సర్పంచ్ సూరప్ సాయన్న,గిరిజన నాయకులు భీమన్న,కొప్పుల చిన్నయ్య,పలువురు ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలను పాటిస్తూ గమ్యానికి చేరుకోవాలి

**ప్రజాపక్షం/ముథోల్ :** రోడ్డు నిబంధనలను పాటిస్తూ ఇతరులను ఇబ్బందులు పెట్టకుండా ప్రయాణికులు సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ సూచించారు.బుధవారం మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో డిఫెన్స్ డ్రైవింగ్ లో భాగంగా అరైవ్ అలైవ్ అనే నినాదంతో సిబ్బందితో కలిసి రోడ్డు నియమాల పై ప్రయాణికులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులు అతివేగంగా నడిపే ప్రైవేట్ వాహనాలలో ప్రయాణించొద్దని సురక్షిత వాహనదారులతో పాటు అన్ని రకాల వాహనదారులు జాగ్రత్తతో వాహనాలు నడపాలన్నారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం,కార్లు ఆపై వాహనాలలో ముందు వరుసలో కూర్చున్న వారు తప్పకుండా సీటు బెల్టు ధరించి భద్రంగా ప్రయాణం చేయాలని కోరారు.మద్యం తాగి వాహనాలు నడుపొద్దని అదేవిధంగా ప్రయాణ సమయంలో మొబైల్ ఫోన్ వాడొద్దని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్సై యశ్వంత్,మహిళా కానిస్టేబుల్ లు రాజమణి,అశ్శు తదితరులు పాల్గొన్నారు.

## ‘ప్రజాపక్షం’క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలో నూతన సంవత్సర ప్రజాపక్షం క్యాలెండర్ను మండల సర్పంచ్ల ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల గొంతుకగా ప్రజాపక్షం కార్మిక కర్షక పక్షపాతిగా ప్రజలలో ఎనలేని ముద్ర వేసుకుందని అన్నారు.మానవుని దైనందిన జీవితంలో క్యాలెండర్ యొక్క పాత్ర రోజుటి దినచర్యను నిర్ణయించడానికి తోడ్పాటునిస్తుందని అన్నారు.ఈ అవిష్కరణ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసికోల్లాసం

### అష్టా గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్

**ప్రజాపక్షం/ముథోల్ :** క్రీడలతోనే మానసికోల్లాసం లభిస్తుందని అష్టా గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ అన్నారు.బుధవారం మండలంలోని అష్టా గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్ పోటీలు అట్టహాసంగా కొనసాగాయి.బ్రహ్మంగావ్,గన్నోరా ,రువ్వి,విటోలి,విటోలి తాండా గ్రామాలకు చెందిన సుమారు 160 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు.ఈ పోటీలను ముథోల్ మండల విద్యాశాఖ అధికారి(ఎంఈఓ)గోపిడి రమణ రెడ్డి,ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కాజామోహినోద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలను చేసి ప్రారంభించారుబ్రహ్మంగావ్ సర్పంచ్ మౌనిక మహేందర్ రెడ్డి,విటోలి సర్పంచ్ దిగంబర్,విటోలి తాండా సర్పంచ్ రాథోడ్ జయశ్రీ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రామ్మోహన్,పీఈటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్,పీడీ పెరుమండ్ల కృష్ణ,లోలం మురళి ఉపసర్పంచ్ సురుగుల సావిత్ర కోటయ్య,పంచాయతీ కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

## అట్టహాసంగా ముగిసిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా క్రికెట్ టోర్నీ

**ప్రజాపక్షం/ముథోల్ :** ముథోల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ముథోల్ లోని ప్రభుత్వం ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించించిన రెండవ సీజన్ క్రికెట్ టోర్నీ మంగళవారం రాత్రి ముగిసింది.గత 11 రోజులుగా కొనసాగిన క్రికెట్ టోర్నీలో తుది పోరు హోరాహోరీగా సాగింది.తుది పోరులో ముథోల్ కు చెందిన బ్లాక్ బోర్డ్ జట్టు,ఆజాద్ జట్లు తలపడ్డాయి.ఉత్కంఠగా సాగిన తుది పోరులో ఆజాద్ జట్టు మొదటి విజేతగా,బ్లాక్ బోర్డ్ జట్టు రెండవ విజేతగా నిలిచింది.తుది పోరు నరాలు తెగే ఉత్కంఠంగా సాగింది.మ్యాచ్ ముగిసిన అనంతరం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో గ్రామ ప్రజా ప్రతినిధులకు,పెద్దలకు,క్రీడాభిమానులకు శాలువాతో సత్కరించి మెమోంటో అందజేయడం జరిగింది. గ్రామ ఉప సర్పంచ్ లావణ్య సాయి,వార్డు సభ్యులు,మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ నిర్మించుట కోసం వినతి

**ప్రజాపక్షం/ఆర్మూర్:** నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పల్లె(హరిపూర్) గ్రామ సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్ బుధవారం పంచాయతీరాజ్ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)కు కలిసి ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీగా ఏర్పడ్డ పల్లె గ్రామానికి జీపీ బిల్డింగ్ స్మశాన వాటిక అంగన్‌వాడీ బిల్డింగ్ ట్రాక్టర్ మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీంతో ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రాంసన్ పాల్గొన్నారు.

## పూజలు చేసిన మంత్రి

**ప్రజాపక్షం/బాల్కొండ:** మండలంలోని సావెల్ గ్రామంలో పంచాయతీరాజ్ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పర్యటనలో భాగంగా ఆదివాసి నాయకపోడ్ కులదైవమైన భీమన్న ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామనాయకుడు సంఘ సభ్యులు జిల్లా సభ్యులు తప్పెట్లతో మంత్రిసి స్వాగతం పలికారు. సర్పంచ్ శ్యామల ముత్యం, భోజన్న, శివశంకర్, రాజేశ్వర్, గంగాధర్, అశోక్, రాజేశ్వర్, నవీన్, సురేష్ పాల్గొన్నారు.

# అక్రమ బొగ్గు టెండర్లపై సింగరేణి జిఎం కార్యాలయం ముట్టడి

### మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు

**ప్రజాపక్షం /శ్రీరాంపూర్/ నస్పూర్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బావమరిది సృజన్ రెడ్డికి అక్రమంగా బొగ్గు గనుల టెండర్లు కేటాయించడాన్ని నిరసిస్తూ మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు బుధవారం శ్రీరాంపూర్ జిఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డితో కలిసి సింగరేణి కార్మికులు, నాయకులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ ప్రజా పాలన పేరుతో ముఖ్యమంత్రి తన కుటుంబ సభ్యులకు తెలంగాణ ప్రజల సొమ్మును దోచిపెడుతున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టెండర్లు పారదర్శకంగా ఉండేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్లు దోచుకోవడానికి బావమరిదికి టెండర్లు అప్పగించిందని ఆరోపించారు. సింగరేణి నిధులతో ఫుట్‌బాల్ క్రీడలు జరిపిన ముఖ్యమంత్రికి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించడం ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. కెసిఆర్ ప్రభుత్వంలో కారుణ్య నియామకాలు ఇచ్చి ఆదుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం గత మార్చి నుండి ఇప్పటి వరకు మెడికల్ బోర్డు ఎందుకు పెట్టడం లేదని నిలదీశారు. మెడికల్ బోర్డు నిర్వహించకుండా సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్, తెలంగాణ బొగ్గు గని



కార్మిక సంఘం మాత్రమే కార్మికులకు అండగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో నస్పూర్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు అక్కురి సుబ్బన్న, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు బండి రమేష్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తహసీల్దార్, ఎస్ఐలను సన్మానించిన సర్పంచులు

**ప్రజాపక్షం / తిర్యాణి :** గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా సర్పంచులు అంకితభావంతో పనిచేయాలని తిర్యాణి తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ వెంకటేష్ సూచించారు. భీంజిగూడ, మరకగూడ గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు బుధవారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారంలో అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరారు. అనంతరం నూతన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోవా దేవేంద్రబాయి, మడావి కమలాబాయి, ఉప సర్పంచ్ కోవా లక్ష్మీబాయి, కోవా దురుగుబాయి, ఆత్రం రాజు, మాజీ ఉప సర్పంచ్ చిన్నరాజు, ఆత్రం సంజీవ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ మార్కండేయ జయంతి ఉత్సవాలు

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ పట్టణంలోని ఎల్ల గౌడ్ తోటలో గల పద్మశాలి కమ్యూనిటీ హాల్లో శ్రీ మార్కండేయ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భవన కమిటీ సభ్యులు సిందం చంద్రయ్య ఆధ్వర్యంలో శ్రీ మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వామివారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాపల్లి సదానందం, గుల్లపల్లి నాగేశ్వర రావు, వడ్నాల వెంకన్న, దోమల సురవర్ధన్, గడదాసు మల్లయ్య, నూతి సుదర్శన్, కొంపల్లి సుదర్శన్, కొప్పుల శంకర్, ఆల్లి గురువయ్య, దండే భీమయ్య, బంక శ్రీనివాస్, తేలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాంటేషన్లను సందర్శించిన ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారులు

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** శిక్షణలో భాగంగా నలుగురు ట్రైనీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులు బుధవారం సిర్పూర్ రేంజ్ పరిధిలోని మాకిడి సెక్షన్ ఇటుకల పహాడ్ బీట్‌ను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ ప్లాంటేషన్లు, చెక్ డ్యామ్‌లను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్లాంటేషన్ల అభివృద్ధి విధానం, అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు చేపడుతున్న చర్యలపై అటవీ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి పులుల సంచారం జరుగుతున్న తీరుపై అధికారులకు అటవీ సిబ్బంది వివరణ ఇచ్చారు.

# కెరమెరి మండల సర్పంచుల ఫోరం ఎన్నిక

**ప్రజాపక్షం / కెరమెరి :** కెరమెరి మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కెరమెరి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెందోర్ ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. ఫోరం గౌరవ అధ్యక్షుడిగా ఆత్రం లక్ష్మణ్, మండల అధ్యక్షుడిగా కుమురం అంబరావు ఎన్నికయ్యారు. కార్యవర్గంలోని ఇతర సభ్యులుగా ఉపాధ్యక్షుడు జాదవ్ అమూల్, ప్రధాన కార్యదర్శి చోలే నాగనాథ్, సంయుక్త కార్యదర్శి రాథోడ్ పుష్పలత, కోశాధికారి కావుడే తులసిరామ్ బాధ్యతలు చేపట్టారు. సలహాదారులుగా దుర్గం బుచ్చయ్య, ఆత్రం ఆనందరావు, రాథోడ్ బలవంతరావు, ఆత్రం ధర్మ, కార్యవర్గ సభ్యులుగా నైక్ పార్వతిబాయి, ఆత్రం అన్నిగా, కార్పెత విమలబాయి,



వడ్గురే రోజా, జాటోత్ శారదలను నియమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కుంరం భీంరావ్, సిడం గంగు, కావడే నాగుబాయి, మాడవి శాంతబాయి, కుడ్మేత కొద్దు, జాదవ్ బీమ్లాబాయి, మాడవి చిత్ర రేణుక, మండడి అనుసయ, తుంరం లచ్చు పాల్గొన్నారు.

# ఆర్‌కె 7 గని సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కె 7 గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నాయకులు గనిని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం గని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గనిలో కార్మికులకు నాణ్యమైన హ్యాండ్ గ్లౌజెస్ ఇవ్వకపోవడం వల్ల పనులు చేసేటప్పుడు దెబ్బలు తగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం వెంటనే నాణ్యమైన గ్లౌజెస్, డ్రిల్ బిట్లు అందించాలని కోరారు. చలికాలం ప్రారంభమైనా కార్మికులకు అందజేయాల్సిన గరం కోట్లు ఇవ్వకపోవడం సరికాదని, వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గనిలో సపోర్ట్ మెన్లకు ప్రత్యేక గది నిర్మించాలని, కార్మికులందరికీ లాకర్లతో పాటు కబోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ట్రామర్ల కోసం గది నిర్మించాలని, ట్రేడ్స్ మెన్లకు హెల్పర్లను కేటాయించడంతో పాటు నూతనంగా చేరిన వారికి టూల్స్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఎస్‌సిసి గేటు నుండి ఆర్‌కె 7 గేటు వరకు నీటిని చల్లాలని, నాణ్యమైన బూట్లు పంపిణీ చేయాలని, కార్మికులు పనిచేసే చోట అవసరమైన మ్యాన్ పవర్ ఉండాలని డిమాండ్ చేశారు. గని మేనేజర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఏరియా సెక్రటరీ అడ్డు శ్రీనివాస్, పిట్ సెక్రటరీ సారయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సదానందం, ప్రతినిధి రాజ్ కుమార్, బానేష్, పవన్, నాగరాజు, రవితేజ, కుమారస్వామి, పైడి పాల్గొన్నారు.

## నేడు కేరమేరి మండలానికి ఉప ముఖ్యమంత్రి రాక

**ప్రజాపక్షం / కేరమేరి :** కుమురం భీం జిల్లా కేరమేరి మండలం మోడీ గ్రామానికి గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రానున్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలతో మాట్లాడనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అజ్మీర శ్యామ్ నాయక్ బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకొని సభా ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లను సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ మధుకర్ తో కలిసి ఆయన పర్యవేక్షించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, సర్పంచ్ ఆత్రం లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




## రోడ్డు భద్రత నియమాలతోనే ప్రమాదాల నివారణ



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా వాహనదారులు ప్రతి ఒక్కరూ భద్రత నియమాలు పాటించాలని సిర్పూర్ టి ఎస్ఐ సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని వేంకట్రావుపేట్ గ్రామం వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్ట్ వినియోగించడం వంటి ప్రాథమిక నియమాలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ముఖ్యంగా అతివేగం, మైనర్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి చర్యల వల్ల అమూల్యమైన ప్రాణ నష్టం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే ప్రమాదాలతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# యువత క్రీడల్లో రాణించాలి

### పెంచికల్పేట్ ఎస్ఐ అనిల్ కుమార్

**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పెంచికల్పేట్ ఎస్ఐ అనిల్ కుమార్ అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట్ మండలం బొంబాయిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రగుంట గిరిజన గ్రామంలో బుధవారం క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేశారు. సర్పంచ్ పొట్టే ఉమా మహేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ ముఖ్య అతిథిగా పాల్గొని కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు వ్యక్తుల మధ్య పోటీతత్వాన్ని పెంచుతాయని, క్రీడల వల్ల యువత శారీరకంగా, మానసిక దృఢంగా తయారవుతారని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాల వైపు సాగాలని సూచించారు.ఉప సర్పంచ్ పాగిడే రఘునాథ్, వార్డు మెంబర్ మల్లేష్, సామాజిక కార్యకర్త చప్పిడి ప్రకాశ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డిపై ఎస్పికి ఫిర్యాదు

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** బిఆర్ఎస్ పార్టీ శ్రేణులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆసిఫాబాద్ ఎంఎల్ఎ కోవ లక్ష్మి బుధవారం జిల్లా ఎస్పి నితికా పంత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖమ్మం బహిరంగ సభలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, బిఆర్ఎస్ శ్రేణులపై సిఎం రేవంత్ రెడ్డి అత్యంత రెచ్చగొట్టేలా, అభ్యంతరకరంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ద్వేషాన్ని ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, బిఆర్ఎస్ నాయకురాలు మర్సకోల సరస్వతి, పట్టణ అధ్యక్షుడు అహ్మద్, సర్పంచ్‌లు బుర్స పోచయ్య, చూనార్కర్ సతీష్, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, చిలువేరు వెంకన్న, పొన్నాల నారాయణ, నిస్సార్, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మందమర్రి సిఐగా పర్సా రమేష్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం / మందమర్రి :** మంచిర్యాల జిల్లా మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పర్సా రమేష్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర పోలీస్ శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడకు నియమితులైన ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టారు. గతంలో కరీంనగర్ ట్రాఫిక్ విభాగంలో ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన పర్సా రమేష్ అక్కడ ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ, ప్రజల్లో అవగాహన పెంపు వంటి అంశాల్లో సమర్థవంతంగా పనిచేశారు. మందమర్రి సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, నేరాల నియంత్రణ ప్రధాన లక్ష్యంగా పనిచేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేస్తూనే లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణను మరింత పటిష్టం చేస్తామని వెల్లడించారు. ప్రజల భద్రతే ధ్యేయంగా నిరంతరం అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తామని సిఐ పర్సా రమేష్ స్పష్టం చేశారు.

## సమ్మక్క సారలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం / తిర్యాణి :** తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన వనదేవతల జాతరను భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్ అన్నారు. తిర్యాణి మండలంలోని చిన్నరెడ్డిపల్లి స్టేజ్ వద్ద వెలసిన శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవాల వాల్ పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 28 నుండి 31 వరకు జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహణ కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, లైటింగ్ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. జనసందోహాన్ని దృష్టిలో ఉంచుకుని పార్కింగ్, క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యువత అధ్యక్షులు పున్నం హరీష్ కుమార్, తిర్యాని సర్పంచ్ మడావి రాజేష్, కన్నెపల్లి సర్పంచ్ తుమ్రం మాన్కు, ఆలయ పూజారి బొమ్మగోని సత్య గౌడ్, నిర్వాణ కమిటీ అధ్యక్షులు గుండం రారాజ్, ఉపాధ్యక్షులు జంగు, ప్రధాన కార్యదర్శి కూడ్మేత అర్జున్, కోశాధికారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# అడవిని తలపిస్తున్న ఎడపల్లి పిహెచ్‌సి

### అధికారుల నిర్లక్ష్యంపై సిబ్బంది ఆగ్రహం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక ప్రస్తుతం ఒక చిట్టడవిని తలపిస్తుంది. రోగులకు మెరుగైన వైద్యం అందించాల్సిన చోట పారిశుద్ధ్యం పడకేయడంతో ఆస్పత్రి పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి. గతంలో హరిత హారం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆస్పత్రి వెనుక భాగంలో వందలాది మొక్కలను నాటారు. అయితే, వాటి సంరక్షణను పంచాయతీ సిబ్బంది గాలికొదిలేశారు. సరైన పోషణ లేకపోవడంతో నాటిన మొక్కల మధ్య పిచ్చి మొక్కలు పెరిగి ఆ ప్రాంతమంతా అడవిలా తయారైంది. చెట్ల నుంచి రాలిన ఎండుటాకులు గుట్టలుగా పేరుకుపోయి చెత్తాచెదారంతో నిండిపోయింది. ఇది చాలదన్నట్లు ఆస్పత్రి ముందు భాగంలో పోగైన చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఈ మంటల వల్ల హరిత హారంలో నాటిన కొన్ని మొక్కలు ఇప్పటికే కాలిపోయాయి. అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఆస్పత్రి పరిసరాల్లో పేరుకుపోయిన పిచ్చి



మొక్కలను, ఎండుటాకులను వెంటనే తొలగించాలని, పారిశుద్ధ్యం మెరుగు పరిచి మొక్కలను కాపాడాలని పిహెచ్‌సి సిబ్బంది, పంచాయతీ అధికారులను కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి ఆస్పత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని స్థానికులు, ఆస్పత్రి సిబ్బంది కోరుతున్నారు.

## అయిలాపూర్‌లో అన్నదానం, ఊరేగింపు

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలోని అయిలాపూర్ గ్రామంలో బుధవారం భక్త మార్కండేయ జయంతి ఘనంగా పద్మశాలి కులస్తులు జరుపుకున్నారు. స్థానిక తారు రోడ్డు నుంచి పద్మశాలి సంఘం వరకు మంగళ హారతులతో ఊరేగింపు తీశారు. అనంతరం పూజా కార్యక్రమాలు జరిపి అన్నదాన సత్రం నిర్వహించారు. మహిళలు, యువకులు తమ సహాయ కార్యక్రమాలు అందించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు గ్రామ సర్పంచ్ మీసాల లక్ష్మి నారాయణ అందజేశారు. కుల పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కి సామాజిక బాధ్యత

**ప్రజాపక్షం/బోధన్:** జిల్లా పోలీస్ కమీషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు బోధన్ ట్రాఫిక్ ఇన్‌ఛార్జి ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తుందని, ట్రాఫిక్ ఎస్సై మహేష్ అన్నారు. ప్రమాదాలు నివారించడానికి వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని అతివేగం ప్రమాదకరమని హెచ్చరించారు. యువత రాష్ డ్రైవింగ్ చేయవద్దని, మైనర్ యువకులు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంవీఐ పండరి, ట్రాఫిక్ సిబ్బంది వినోద్, చందర్ పాల్గొన్నారు.

## అభ్యాస ఫలితాలు మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/బోధన్:** విద్యార్థుల అభ్యాస ఫలితాలు మెరుగు పడేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో సూచించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా వర్ని మండలం జాకోరా గ్రామ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మూడవ తరగతి విద్యార్థుల ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస స్థాయి సంతృప్తికరంగా లేవని, మెరుగు పడేలా చూడాలని ఎంఈవోకు ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలను సబ్ కలెక్టర్ పరిశీలించారు.

# రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మోర్తాడ్:** ఖమ్మంలో ఈ నెల 23, 24, 25న జరుగు పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల పోస్టర్లను నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్ల ఉపాధ్యక్షులు డి.నిఖిల్ మాట్లాడుతూ.. 79ఏండ్ల స్వాతంత్ర్య పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద మధ్య తరగతి వర్గాలకు ఉచితంగా నాణ్యమైన సమాన విద్యను అందించడంలో పూర్తిగా విఫలమైయ్యారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలకు అప్పగించి విద్యా వ్యవస్థను పూర్తిగా వ్యాపారమయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు విద్యారంగా అభివృద్ధిని, విద్యార్థుల సంక్షేమానర్ని, విశ్వ విద్యాలయాల పరిరక్షణను పూర్తిగా విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యరంగాన్ని కాషాయికరించి, విద్యార్థుల మెదళ్లలో కుల, మత విష బీజాలు నాటుతూ దేశంలో మతోన్మాద ఫాసిజాన్ని పెంచి పోషిస్తున్న మోడీ ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్ల కుట్ర పూరిత విధానాలను నేటి విద్యార్థులు ప్రతిఘటించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. 1972లో ఉస్మానియా యూనివర్సిటీలో కామ్రేడ్ జార్జిరెడ్డి ప్రేరణతో ఆవిర్భావించిన పీడీఎస్‌యూ నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం విద్యార్థుల హక్కల కోసం శాస్త్రీయ విద్య, సమానత్వ సమాజ స్థాపన కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. భాగంగా రాష్ట్ర 23వ మహాసభలు జరుపుతున్నామన్నారు. ఖమ్మంలో జరిగే పీడీఎస్‌యూ 23వ రాష్ట్ర మహాసభలకు విద్యార్థిలోకం అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి యాస్ దుర్గా ప్రసాద్, రాహుల్, అభిషేక్, అరవింద్, విష్ణు పాల్గొన్నారు.

# కిడ్నీ మార్పిడితో డయాలసిస్ సమస్య దూరం

### యశోధ ఆస్పత్రి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మామిడి ప్రణిత్‌రామ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కిడ్నీ మార్పిడి చేసి మా ట్రీట్‌మెంట్ ద్వారారోగికి డయాలసిస్ సమస్య శాశ్వతంగా దూరమయ్యేలా చేశామని యశోధ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ప్రణీత్‌రామ్ వెల్లడించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని యశోధ ఆస్పత్రికి కేర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన షకీల్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన రెండు కిడ్నీల సమస్యతో 20222024 వరకు డయాలసిస్ ప్రారంభించిన వ్యక్తిని ప్రాణాపాయం నుండి రక్షించామన్నారు. డయాలసిస్ క్యాథెటర్ ఇన్‌ఫెక్షన్ల వంటి సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ పట్టుదలతో నిలబడ్డారన్నారు. షకీల్‌కు కిడ్నీ మార్పిడికి ముందు చేసిన పరీక్షల్లో గుండె సమస్య బయటపడిందన్నారు. దీని కోసం ఆయనకు కరోనరి ఆర్జరి స్టెంటింగ్ చేయడం జరిగిందన్నారు. స్టెంట్ వేసిన ఆరు నెలల తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగామారటంతో కిడ్నీ మార్పిడి విజయవంతంగా జరిగిందన్నారు. కిడ్నీ మార్పిడి అవశ్యకతపై అతనికి వివరించగా షకీల్ భార్య మనోవర్ ఇర్పానా తన కిడ్నీ ఇవ్వటానికి ముందుకు రావటంకీలమైన మలుపు అన్నారు. 2024 లో కిడ్నీ మార్పిడి జరిగినతర్వాత ఇప్పుడు ఎవరి సాయం లేకుండా ఉపాధ్యాయుడిగా తన వృత్తిని, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ సాధారణ జీవితాన్ని గడుపుతున్నారన్నారు. కిడ్నీ మార్పిడిపై సందేహాలున్న వారికి షకీల్ ప్రయాణం గొప్ప స్ఫూర్తి అని కొనియాడారు. సరైన వైద్యం, కుటుంబ సభ్యుల మద్దతు ఉంటే మళ్లీ ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. సమావేశంలో యశోధ ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ శ్రీరాం సురేష్ పాల్గొన్నారు.

## పూజలు చేసిన మంత్రి

**ప్రజాపక్షం/బాల్కొండ:** మండలంలోని సావెల్ గ్రామంలో పంచాయతీరాజ్ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పర్యటనలో భాగంగా ఆదివాసి నాయకపోడ్ కుల దైవమైన భీమన్న ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ శ్యామల ముత్యం, భోజన్న, శివశంకర్, రాజేశ్వర్, రాజేశ్వర్, నవీన్, సురేష్ పాల్గొన్నారు.

## ర్యాలీని ప్రారంభించిన మంత్రి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్డు భద్రత వారోత్సవాల ర్యాలీని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. వాహనదారులు ఖచ్చితంగా రోడ్డు భద్రతా నియామాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్ రెడిడ, నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, సిఐ సత్యనారాయణగౌడ్, ఎస్ఐ తి నాయకులు ఉన్నారు.




## ఎలక్షన్ల పేరుతో అభివృద్ధి పనులు డ్రామా

**ప్రజాపక్షం/భీమ్‌గల్:** బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో మళ్లీ శంకుస్థాపనలు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన 11 కోట్లతో మళ్లీ శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, మాజీ జడ్పీటీసీ చౌట్‌పల్లి రవి మండిపడ్డారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో అంబటి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఒప్పించి మున్సిపల్‌గా మారటంతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించాలన్నారు. 2018 లో మున్సిపాలిటీగా రూపొందించడంచెందిన తర్వాత ఇప్పటివరకు సుమారు 50 కోట్లతో పనులు జరిగాయని ఇట్టి పనులు కాంగ్రెస్ నాయకులకు కనబడటం లేదని ఎద్దేవా చేశారు. పట్టణ ప్రజలే అభివృద్ధిని గుర్తు చేయడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ 12 కౌన్సిలర్ స్థానాలను గెలుచుకుని బీఆర్ఎస్ జెండా ఎగురవేయటం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎఫ్ఎ సిఎస్ చైర్మన్ శివసారి నర్సయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ భగత్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు మొయిాజ్, మాజీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సింగరేణి ఐక్య కార్మిక సంఘాల వేదిక (జెఎసి) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నస్పూర్ మండలంలోని సిసిసి కార్నర్ వద్ద నిర్వహించిన నిరసనలో ఐఎఫ్‌టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి బ్రహ్మానందం మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం వల్ల కార్మికులు తమ హక్కులను కోల్పోతారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమే కేంద్రం ప్రధాన ఉద్దేశమని, దీనివల్ల పర్మనెంట్ ఉద్యోగాలకు భద్రత ఉండదని విమర్శించారు. సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. పని గంటలను పెంచడం, మహిళలతో రాత్రి వేళల్లో పని చేయించడం వంటి నిబంధనలను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శంకర్ (హెచ్ఎంఎస్), రాజన్న (టిఎస్‌యుఎస్), మణిరామ్ సింగ్ (టిఎన్‌టియుసి), పోశమల్లు (ఎఐఎఫ్‌టియు), విశ్వనాథ్ (జిఎల్‌బికెఎస్), అనిల్ రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన 'ప్రజాపక్షం'

### నిజామాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పంచరెడ్డి శ్రీకాంత్



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజల సమస్యలను, చైతన్యవంతమైన కథనాలతో, వ్యాసాలతో ఎప్పటికప్పుడు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావడంలో ప్రజాపక్షం దినపత్రిక ముందుంటుందని నిజామాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పంచరెడ్డి శ్రీకాంత్ అన్నారు. బుధవారం ప్రజాపక్షం దినపత్రిక కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక దినదినాభివృద్ధి సాధించాలని, ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తేవడంలోను, సమాజంలోని రుగ్మతలను బహిష్కృతం చేయడంలో ముందుండాలని ఆకాంక్షించారు. రాజకీయ నాయకుల దృష్టి పీడిత ప్రజలపై పడేలా చైతన్యవంతమైన కథనాలను అందిస్తు ప్రజల పక్షాన నిలవాలని అన్నారు. ప్రజాపక్షం దినపత్రిక దినదినాభివృద్ధి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల బ్యూరో చీఫ్‌లు నరసింహాచారి, భద్రారెడ్డి, బొబ్బిలి నరసయ్య, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు సుభాష్ వాగ్నేర్, వివిధ పత్రికల ప్రతినిధులు కర్క రమేష్, విజయ్ కుమార్, సుదర్శన్, శివ కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క అవకాశం ఇవ్వండి

### సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహిం

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** భారతదేశంలో లౌకిక పార్టీగా పేరొందిన సమాజ్‌వాదిపార్టీ జాతీయ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సింహాద్రి మార్గదర్శకంలో నిజామాబాద్ కార్పొరేషన్ ఎన్నికలలో సమాజ్‌వాది పార్టీ 60 డివిజన్లలో ఆయా వర్గాలకు చెందిన రిజర్వేషన్లకు అనుగుణంగా కుల, మతాలకు అతీతంగా, లింగ వివక్ష లేకుండా, షెడ్యూల్ కులాల, తెగల వారికి, మైనార్టీలకు పెద్దపీట వేస్తుందని, ఒకసారి సమాజ్‌వాది పార్టీని ఆదరించాలని జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహీం అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో, నిజామాబాద్ మునిసిపల్ ఎన్నికల సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ మతతత్వ సిద్ధాంతాలతో దేశంలో మతాల మధ్య చిచ్చుపెడుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాలు గడిచినా ఎలాంటి అభివృద్ధి సాధించలేదన్నారు. కాబట్టి నిజామాబాద్‌లో కార్పొరేషన్ ఎన్నికలలో సమాజ్‌వాది పార్టీ అభ్యర్థులను ఎన్నుకొని అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ఐషా ఫాతిమా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ హర్షద్, బిస్మిల్లా బేగం, ఇరమ్ కౌశ, మహ్మద్ ఉమెన్ తదితరులు పాల్గొన్నారు.

## నందిపేట్‌లో భక్త మార్కండేయ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో బుధవారం మార్కండేయ ఆలయంలో భక్త మార్కండేయ జయంతి వేడుకలు జరిగాయి. సంఘ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు, అన్నదాన సత్రం జరిగాయి.